
**ఎంతగానో అభిమానించి, గౌరవించే రత్నాల్లాంటి ముగ్గురు బిడ్డల అభ్యర్థనని తిరస్కరించిన ఆ 'రిటైర్డ్' తండ్రి అంతర్యం...?**

# బెంగ

'అభిమన్యు'



ఆకాశం చవకబారు చీర కట్టినట్లుంది. ఎక్కడా చిన్న మబ్బు తునకైనా కనిపించడం లేదు. పొగ చూరినట్లు కళాకాంతులు లేకుండా ఉంది. ఉండుండి మెరుపు కన్యలు 'తళుక్' మని మెరిసి మాయ మవుతున్నాయి.

వాతావరణం చల్లగా, మత్తుగా ఇంది. నన్నని చినుకులు గత మూడు రోజుల్నుంచి పడుతూనే ఉన్నాయి.

విశ్వనాథం వీధి గుమ్మంలో వాలు కుర్చీలో కూర్చొని పేపరు చూస్తున్నాడు. ఉండుండి వీచిన గాలికి వర్షపు చినుకులు విరిగి తుంపర్లుగా పిచికారీ చేసినట్లు ముఖంమీద పడుతుంటే ఆయన ఆనందంతో తుడుచుకుంటున్నాడే గాని, అక్కడ్నించి కదలటం లేదు.

"అలా వర్షంలో తడుస్తూ పేపరు చదవకపోతే ఇలా లోనికి రాకూడదండీ...!" లోపల్నుంచి అక్కడికి వచ్చిన రాజ్యలక్ష్మి భర్త నుద్దేశించి అంది.

విశ్వనాథం చిన్నగా నవ్వి - "ఆ వానని చూడు. నీ కేమీ అనిపించటంలేదా! నా కయితే ఆ వానలో తడవాలని ఉందోయ్! కాని, నా వయసు అందుకు ఒప్పుకోవడం లేదు. ఒకవేళ వయసు ఒప్పుకున్నా నీవు ఒప్పుకోవద్దు...!" అన్నాడు.

"బాగుంది. అక్కడికి నే నంటే భయ మన్నట్లు. నర్లెండి గాని ముందు కుర్చీని ఇవతలకైనా కాస్త లాక్కోండి. మీ ఆరోగ్యం అసలే అంతంతమాత్రం. ఇహ జలుబు చేసిందంటే ఒక పట్టాన పోదు" అంది రాజ్యలక్ష్మి.

ఈలోగా సైకిల్ బెల్ మోగించుకుంటూ అక్కడికి వచ్చాడు పోస్ట్‌మాన్ సుందరం. సైకిల్ స్టాండు వేసి, గొడుగు మూసి - "పాడు వర్షం... పాడు వర్షం... చంపేస్తుం దనుకో.. పడేదేదో గట్టిగానైనా పడదు..." నణుక్కుంటూ జేబురుమాలుతో జుత్తు, ముఖం తుడుచుకుంటూ వచ్చాడు.

"రా రా పోస్ట్‌మాన్. ఇంకా రాలేదేమని చూస్తున్నాను. కాఫీ టైంకి మాత్రం ఠంచనుగా వచ్చేస్తావు." నవ్వుతూ అన్నాడు విశ్వనాథం.

"నీ పని బాగుందిరా. హాయిగా ఇంటిపట్టున కూర్చొని మా చెల్లెమ్మ వండి పెట్టినవన్నీ తిని చిలకలా 'మాట్లాడుతున్నావ్...'" అంటూ అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు సుందరం.

"నువ్వు మాత్రం ఎన్నాళ్ళు చేస్తావురా! మరో రెండు నెలలు. అంతేగా! అప్పుడు నీవు కూడా నాలాగే ఏ అరుగుమీదనో, ఏ మూలనో ఇలా కూర్చుంటావ్. దయ కలిగితే టైమ్ కింత కాఫీనీళ్ళు, రెండు మెతుకులు పడేస్తారు ఈ ఆడవాళ్ళు..." అంటూ ఓరగా రాజ్యలక్ష్మి వైపు చూశాడు విశ్వనాథం.

"అనండి. అనండి. ఏదో ఒకటి అనందే మీకు నిద్ర పట్టదు. కడుపు నిండదు. ఈయనగారితో నేటిగాని, ఉండు అన్నయ్యా కాఫీ తెస్తాను" అంటూ లోనికెళ్ళింది రాజ్యలక్ష్మి.

"ఇదుగోరా, విశ్వం, నీ ముగ్గురు కొడుకులు కూడబలుక్కొని రాసినట్లున్నారు..." అంటూ మూడు కవర్లు బాగ్‌లోంచి తీసి ఇచ్చాడు సుందరం.

విశ్వనాథం అవి అందుకొని - "ఆశ్చర్యంగా ఉందే! అందుకేనేమో ఈ వర్షం ఇలా వదలకుండా కురుస్తోంది..." అన్నారు.

"నీ కంత వేళాకోళమేరా! కొడుకులు ఉత్తరం రాస్తే ఆశ్చర్యం దేనికిరా? అయినా కొడుకు లంటే వారురా. క్రమశిక్షణకి పెట్టింది పేరు. అలాంటి కొడుకులు ఈ రోజుల్లో ఎంతమంది ఉన్నారురా! ఎంతమందికి ఉన్నారురా!" అన్నాడు సుందరం.

"ఆ కొడుకుల్ని చూసుకునే వారు పొంగిపోతుంటారు. ఆయన సంగతి తెలియదా అన్నయ్యా! పైకి అలాగే మాట్లాడుతారు." కాఫీలు ఇద్దరికీ ఇస్తూ అంది రాజ్యలక్ష్మి.

"ఇదిగోనోయ్! నీ కొడుకులు కట్ట కట్టుకొని ఉత్తరాలు రాశారు. కాస్త చదివి వినిపించు." విశ్వనాథం కవర్లు రాజ్యలక్ష్మికి అందించాడు.

రాజ్యలక్ష్మి వాటిని తీసుకోకుండా - "అంతోటి భాగ్యం. అక్షరాలు నాకు సరిగ్గా కనిపించవనే కదా మీ వేళాకోళం" అంది.

"అదేంటోయ్! అప్పుడే ముసలిదానివైపోయావా!" ఆశ్చర్యాన్ని కనబరుస్తూ అడిగాడు విశ్వనాథం.

"అహ కాదు. మీ రింకా నవయువకులే ననుకుంటున్నారా! ఎవరైనా పిల్ల నిస్తారేమో చూడండి ఇంతోటి అందానికి." రాజ్యలక్ష్మి రెండు చేతులూ అటూ ఇటూ ఊపుతూ అంది.

"మరి ఈ అందాన్ని చూసేకదా మన పెళ్ళిచూపుల్లో మూర్ఛపోయావు..." విశ్వనాథం చిలిపిగా నవ్వుతూ అన్నాడు.

"ఛీ! పోదురూ...!" రాజ్యలక్ష్మి నవ్వుతూ లోనికి వెళ్ళిపోయింది.

"విశ్వం! ఎందుకురా చెల్లాయ్‌ని అలా ఆట పట్టిస్తావ్..." సుందరం నవ్వుతూ అన్నాడు.

"ఈ వయసులో ఎవర్ని ఆటపట్టిస్తే ఎవరు ఊరుకుంటార్రా. తనకి నేను. నాకు తనే కదా! ఏదో కాలక్షేపానికి."

సుందరం కాసేపు ఉండి ఈ మాట ఆ మాట మాట్లాడి వెళ్ళిపోయాడు.

విశ్వనాథం, సుందరం చిన్ననాటి స్నేహితులు. అదే ఊర్లో కలిసి తిరిగారు. కలిసి ఆడారు. కలిసి చదువుకున్నారు. విశ్వనాథం తను చదివిన స్కూలులో హెడ్మాస్టరుగా చేసి ఈమధ్యనే రిటైర్ అయ్యాడు. సుందరం పోస్ట్‌మాన్‌గా చేస్తున్నాడు. మరో రెండు నెలల్లో అతను కూడా రిటైర్ అయిపోతాడు. అవసరం ఉన్నా లేకపోయినా ప్రతి రోజూ వా రిద్దరూ కలవాల్సిందే. లేకుంటే ఇద్దరికీ ఏదో తెలియని వెలితి.

విశ్వనాథం ముగ్గురు కొడుకులు రాసిన ఉత్తరాలూ చదివి తనలో తనే నవ్వుకోవడం చూసి - "ఏమిటండీ! మీలో మీరే నవ్వుకుంటున్నారు! ఏం రాశారేంటి మీ అబ్బాయిలు...!" అడిగింది రాజ్యలక్ష్మి.

"ఏం రాస్తారు! రే పొచ్చే ఆదివారం వాళ్ళు వస్తున్నారట!"

"ఎందుకట! ఈమధ్య పండుగలు, పబ్బాలు ఏవీ లేవు కదా...!" ఆశ్చర్యపోయింది రాజ్యలక్ష్మి.

"పిచ్చిదానా! నేను మొన్ననే కదా రిటైర్ అయ్యాను. రిటైర్ అయ్యాక వచ్చిన పి.ఎఫ్. డబ్బు, ఇన్సూరెన్సు డబ్బు, వగైరా వగైరాలన్నీ వారసులకి ఇవ్వకపోతే ఎలా...?" విశ్వనాథం అద్దాలు తీసి లాల్చీకి తుడుస్తూ అన్నాడు.

"ఛ! ఊరుకోండి. వారు మీ అబ్బాయిలండీ! మీ అభిమతానికి అనుగుణంగా నడుచుకుంటారు." విశ్వనాథం ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అంది రాజ్యలక్ష్మి.

"నా పిల్లల గురించి నాకు తెలుసోయ్! వాళ్ళు దేనికి వస్తున్నారో కూడా తెలును." వాలు కుర్చీలో వెనక్కి జారగిలపడి అన్నాడు విశ్వనాథం.

విశ్వనాథం - రాజ్యలక్ష్మికి ముగ్గురు కొడుకులు. వారు సత్యం, శివం, సుందరం. పెద్దోడు సత్యం హైదరాబాద్ హెచ్.ఎమ్.టి.లో మెకానికల్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు. శివం విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్‌లో డాక్టర్‌గా చేస్తున్నాడు. తనకీ ఇద్దరు పిల్లలు. సుందరం విజయవాడలోని ఓ పత్రికకి సబ్-ఎడిటర్‌గా చేస్తున్నాడు. తనకి ఒక పిల్లాడు.

సత్యం, శివం, సుందరం ముగ్గురూ క్రమశిక్షణకి పెట్టింది పేరు. ఎప్పుడూ తండ్రి మాటకి ఎదురు చెప్పేవారు కాదు. కాదని తలూపేవారు కాదు. మంచైనా, చెడైనా తండ్రి నోటంట వచ్చే ప్రతి మాట వారికి వేదం లాంటిది.

విశ్వనాథం తన కొడుకుల్ని ఒక పద్ధతి ప్రకారం పెంచుకొచ్చారు. వారి ఆలోచనల్నీ, అభిరుచుల్నీ తెలుసుకొని వారి కిష్టమైన చదువులు చదివించారు. వారి మనసుల్ని ఎన్నడూ నొప్పించలేదు. వారి కోరికల్ని కాదనలేదు. అలాగే వారినుంచి ఏదీ ఆశించలేదు.

** ** **

ఆ రోజు ఆదివారం. ఉత్తరాలు రాసినట్లుగానే సత్యం, శివం, సుందరం ఓ గంట అటూ ఇటూగా వచ్చారు. వాళ్ళని చూసి - "మీ రొక్కక్కరే వచ్చారు. కోడళ్ళు, పిల్లలు ఏరి?" అడిగింది రాజ్యలక్ష్మి.

"నాన్నగారితో మాట్లాడి... అయినా ఈ ఒక్క రోజుకి దేనికని..." నసుగుతూ అన్నారు ముగ్గురు కొడుకులూ.

మధ్యాహ్నం భోజనా లయ్యాక విశ్వనాథం వాలుకుర్చీలో కూర్చున్నాడు. అతని పక్కగా స్నేహితుడు సుందరం కూర్చున్నాడు. వారి కెదురుగా సత్యం, శివం, సుందరం కూర్చున్నారు. కాస్త దూరంగా నున్న స్థంభా న్నానుకొని రాజ్యలక్ష్మి కూర్చుంది.

"నాన్నగారూ! మీరు ఎలాగూ రిటైర్ అయిపోయారు. ఈ ఇల్లు అమ్మేసి మా దగ్గరికి వచ్చేస్తే బాగుంటుంది..." సత్యం మెల్లగా అన్నాడు.

"అవునండి నాన్నగారూ! ఈ వయసులో మీకు విశ్రాంతి కావాలి. మా దగ్గరికి వచ్చేయండి..." అన్నాడు శివం.

"డాడీ! మీ రెంతో కష్టపడి మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. మీ రిక ప్రశాంతంగా గడపాలి. మా దగ్గరికి వచ్చేయవలసిందిగా కోరుతున్నాం..." అన్నాడు సుందరం.

విశ్వనాథం చిన్నగా నవ్వుకున్నాడు. కొడుకులకి తనమీద గల అభిమానానికి ఆయన ఉక్కిరిబిక్కిరైపోతున్నాడు.

"తల్లిదండ్రుల మీద మీకు గల గౌరవానికి, భక్తికి, ప్రేమకి, అభిమానానికి పొంగిపోతున్నానురా. కాని, మీ ముగ్గురూ మూడు చోట్ల ఉన్నారు. మేము ఎవరి దగ్గరికనీ వచ్చేదిరా...?" అన్నారు విశ్వనాథం.

"నా దగ్గరికి రండి... నా దగ్గరికి. రండి... నా దగ్గరికి రండి..." అని ముగ్గురు కొడుకులూ ఒకేసారి అన్నారు.

విశ్వనాథం, రాజ్యలక్ష్మి చిన్నగా నవ్వుకున్నారు.

"నేను పెద్దవాణ్ణి కాబట్టి అమ్మా నాన్నా నా దగ్గ రుంటారు..." అన్నాడు సత్యం.

"నేను చిన్నవాణ్ణి కాబట్టి మమ్మీ డాడీ నా దగ్గరికి వస్తారు" అన్నాడు సుందరం.


"పెద్దా చిన్నా కాదు. మధ్యముడిని కాబట్టి అమ్మా, నాన్నా నా దగ్గరికి వస్తారు..." అన్నాడు శివం.

"అదేం కుదరదు. పెద్దవాణ్ణి - నేను చెప్పినట్లు మీరు వినండి. అమ్మా, నాన్నని తీసుకువెళ్దామనే ఈమధ్య పెద్ద పోర్షన్ అద్దెకు తీసుకున్నాను." కాస్త కోపంగా అన్నాడు సత్యం.

"అమ్మా, నాన్న ఆరోగ్యం చూస్తే అంతంత. వారికి తరచూ వైద్య సదుపాయం కావాలి. నేను డాక్టర్ని కాబట్టి నా దగ్గర ఉండడం అన్ని విధాల మంచిది" అన్నాడు డాక్టర్ శివం.

"మీ ఇద్దరిదీ బాగుంది. సత్యం అన్నయ్య పెద్ద పోర్షన్ తీసుకున్నాడు. నువ్వేమో డాక్టర్‌వి. మీ ఇద్దరి దగ్గరే అమ్మా, నాన్నా ఉండాలి. నేను కొడుకుని కానా? ఏది ఏమైనా అమ్మా, నాన్నని నా దగ్గర ఉంచుకుంటాను..." కాస్త పౌరుషంగా అన్నాడు సుందరం.

ఈ సమస్య ముగ్గురికీ ఒకటి. ముగ్గురికీ అమ్మా, నాన్న కావాలి. ఉద్యోగరీత్యా ఒక్కొక్కరు వేర్వేరు ప్రదేశాలలో ఉన్నారు కాబట్టి లేకుంటే కలిసి ఉండే మనస్తత్వం గలవాళ్ళు.



ముగ్గురూ బాగా ఆలోచించిన మీదట ఒక నిర్ణయానికి వచ్చారు. ఒక్కొక్కరు ఆరు నెలలు తల్లిదండ్రుల్ని తమ దగ్గర ఉంచుకుందామని ఆలోచించారు. అయితే ఇక్కడ కూడా 'నేను ముందు...నేను ముందు... నేను ముందు...' అని సత్యం, శివం, సుందరం వాదించుకుంటున్నారు.

వారి వాదనల్ని విని విశ్వనాథం ఇలా అన్నాడు- "ఒరేయ్! మీ మీ వాదనలు బాగానే ఉన్నాయ్. ఇంతకీ మీ అమ్మని అడిగార్రా...!"

"ఇది మరీ బాగుంది. ప్రత్యేకించి నన్ను అడిగేదేముంది! మిమ్మల్ని అడిగితే చాలదా! మీ అభిప్రాయాన్ని నిర్ణయాల్ని నేను ఏనాడైనా కాదన్నానా...!" గద్గద స్వరంతో అంది రాజ్యలక్ష్మి.

విశ్వనాథం భారంగా నిట్టూర్చి, "ఒరేయ్ అబ్బాయిలు! మేము ఎక్కడికీ రాలేమురా. ఒకవేళ వచ్చినా మీ దగ్గిర ఉండలేమురా..." అన్నాడు.

బాంబు పడినట్లు అదిరి పడ్డారు సత్యం, శివం, సుందరం. వారితోపాటు స్నేహితుడు సుందరం, భార్య రాజ్యలక్ష్మి ఆశ్చర్యపోయి విశ్వనాథం వైపు చూడసాగారు.

"విశ్వం! నువ్వు చాలా అదృష్టవంతుడివిరా. నీ కొడుకులు రత్నాలురా. అందరికీ ఇలాంటి కొడుకులు ఉంటే ఏ తల్లి దండ్రి అయినా ఎందుకు బాధపడ్తారు? ఆస్తి కోసం కన్నవా రనీ, రక్తం పంచుకు పుట్టినవా రనీ చూడకుండా, దయా దాక్షిణ్యాలు లేకుండా ఒకర్ని ఒకరు నరుక్కుంటున్న ఈ రోజుల్లో ఎటువంటి స్వార్థం లేకుండా మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటామన్న కొడుకుల దగ్గరికి వెళ్ళనంటా వేమిటిరా!" సుందరం స్నేహితుడి భుజం తట్టి అన్నాడు.

"నాన్న గారూ! మీ పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తే క్షమించండి. మేము చేసే అపరాధం ఏమైనా ఉంటే మమ్మల్ని మందలించండి. అంతే గాని మా దగ్గరికి రాలేమని అనకండి. మీ ఇష్టం మీరు మా ముగ్గురిలో ఎవరి దగ్గర ఉన్నా మిగతా వాళ్ళకి ఎటువంటి అభ్యంతరం లేదు. అంతా మీ ఇష్టం..." అన్నాడు సత్యం.

"ఒరేయ్ సత్యం! మీరు నా కొడుకులురా! మీరు తప్పు చేయడ మేమిటిరా! మీ బాధ్యత మీరు నెరవేర్చుతున్నారు..." విశ్వనాథం అలా అనేటప్పుడు అతని గొంతు బొంగురుపోయింది.

"విశ్వం! ఎందుకురా ఈ తత్సరం. నాకూ ఉన్నార్రా ఇద్దరు కొడుకులు. నే నెప్పుడు రిటైర్ అయిపోతనా. ఎప్పుడు ఆ వచ్చే డబ్బు పంచుతనా అని కాచుక్కూర్చున్నారు. నీవేమో బంగారం లాంటి నీ కొడుకులు దగ్గరికి వెళ్ళనంటున్నావ్" అన్నాడు స్నేహితుడు సుందరం.

విశ్వనాథం రాజ్యలక్ష్మివైపు చూశారు. ఆమె స్థంభా న్నానుకుని కూర్చుని ఎటో చూస్తోంది. ఇక్కడ ఇంత జరుగుతున్నా తనకేమీ పట్టనట్లు ఉంది. ఆమె వదనంలో ఎటువంటి భావం లేదు! చిన్న అలసట తప్ప.

నిజమే. ఆ దంపతు లిద్దరూ జీవితంలో బాగా అలసిపోయారు. వారి కిప్పుడు విశ్రాంతి ఎంతో అవసరం. ఏ బరువులు, బాధ్యతలు లేని జీవితం గడపాలి. ఆ విషయం చెప్పాడు విశ్వనాథం.

"నాన్నగారూ! మా దగ్గర మీకు విశ్రాంతి దొరకదని ఎందు కనుకుంటున్నారు! మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తాం..." అన్నారు శివం, సుందరం.

"ఒరేయ్! మేము ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చాంరా. అక్కడ ఒకరి సేవలు, సలహాలు అందర్కీ కావాలి. అందరి మాట ఒక్క మాటగా ఉంటుంది. అక్కడ ఏం చేసినా మన కోసం, మన వాళ్ళకోసం చేసేవాళ్ళం. ఇప్పుడు అలా కాదు. నేను, నా వాళ్ళు, ఎవరి సంసారం వాళ్ళది. ఎవరి జీవితం వాళ్ళది. ఆర్థికపరమైన ఆలోచనలు మనిషిని మనిషిని దూరం చేస్తున్నాయి.

"మీ దగ్గరికి వచ్చి చీకూ చింత లేని జీవితం గడపాలని ఉందిరా. కాని, మీ తరంలో మా తరం ఇమడలేదు. జీవితంలో ఎవరికి ఎవరు తోడు ఉండకపోయినా భర్తకి భార్య, భార్యకి భర్త జీవితాంతం తోడుంటార్రా. జీవితం చివరి మెట్టు మీద ఉన్న వాళ్ళం. మా కిక ఏ ఆశలు, ఆశయాలు లేవు. మీరు సంతోషంగా ఉండడమే మాకు కావాలి.

"మీ అమ్మకి ఉండుండి గుండెల్లో నెప్పి వస్తుందిరా. నా ఆరోగ్యం సంగతి కూడా మీకు తెలియంది కాదు. ఈ వయసులో మాకు డాక్టర్ కన్నా ఏకాంతం ముఖ్యం. మీ అమ్మ నన్ను పెళ్ళి చేసుకున్న పాపాన తనకి జీవితంలో సుఖం లేకుండా పోయింది. నాకు, నా వాళ్ళకి, మీకు సేవలు చేసి చేసి బాగా అలసిపోయింది. దగ్గరుండి ఆమెను కాపాడుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. ఇంక మేము ఎక్కడికి రాలేమురా... రాలేము..." విశ్వనాథం గొంతు బొంగురుపోయింది. అంతవరకూ అతని కనులలో గూడు కట్టుకున్న కన్నీరు జలజలా అతని చెంపల మీద నుంచి జారాయి.

గుండెలోతు ల్లోంచి పొంగు కొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక నోటికి పైట చెంగు అడ్డు పెట్టుకొని, అక్కడ ఉండలేక లోనికి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

"విశ్వం! నువ్వు చాలా గొప్ప వ్యక్తివిరా! 'భార్య' అంటే పిల్లలు కనే యంత్రమని, సేవలు చేసే సేవకురాలని భావించే ఈ పురుష ప్రపంచంలో నీలాంటి వ్యక్తులు చాలా అరుదురా! నీకు నీ జీవిత భాగస్వామి మీద గల అభిమానానికి, ఆత్మీయతకి, అనురాగానికి నేను పొంగిపోతున్నాను. కాస్త ఈర్ష్యగా కూడా ఉందిరా! అందరూ నీలాంటి మనస్తత్వం కలిగి ఉంటే దాంపత్య జీవితాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతాయి." సుందరం ఆనందంతో స్నేహితుని కౌగిలించుకున్నాడు.

సత్యం, శివం, సుందరం నోట మాట రాక తండ్రి వైపు చూస్తూ ఉండిపోయారు. వారికి విశ్వనాథం గారు తండ్రియే కాదు. గురువు, దైవం. వారికి తండ్రి నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. ఆ పుణ్య దంపతుల కడుపున తాము పుట్టినందుకు ఎంతో ఆనందంగా ఉంది వాళ్ళకి. కాని, ఆ తల్లిదండ్రులకి ఎటువంటి సేవలు అందించలేకపోయామనే బాధతో ఎవరి ఇంటికి వారు బయలుదేరారు. ★

## పత్ర విలాపం

బాధ కలిగినప్పుడు కంట నీరు రావడం సహజం. చెమ్మతో కూడిన వెచ్చని రాత్రుల అనంతరం ప్రాతఃకాలంలో కొన్ని గడ్డి మొక్కల ఆకుల అంచులపైన నీటి బిందువులు కనిపిస్తాయి. అయితే ఈ నీరు బాధకు ప్రతీక కాదు. ఇది శరీర ధర్మక్రియ. వేరు పీడనంవల్ల ఇలా జరుగుతుంది. ఈ విధంగా మొక్కల వాయుగత భాగాల నుంచి వెలువడే నీటిని 'బిందు స్రావం' అంటారు. సాక్సీఫ్రాగా మొక్కల్లో పుష్పించే సమయంలో బిందు స్రావం ముమ్మరంగా జరుగుతుంది. కోలకేషియా ఆన్టికోరమ్ మొక్కల్లో రోజుకు 10 నుంచి 100 మిల్లీమీటర్ల వరకూ మామూలుగా బిందు స్రావం జరుగుతూనే ఉంటుంది.

నమ్మెట గోవర్ధన్

